క్లుప్తంగా

20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి



విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ, నిరుద్యోగ ప్రజావ్యతిరేక విధానలకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐసీటీయూ, ఎంసీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యాధరపేటలోని ఎంసీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా పలు కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు సంయుక్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఏఐసీటీయూ నాయకులు గొల్లపూడి ప్రసాద్, కలకోటి బసవయ్య, బండారు శ్రీనివాసరావు, ఎంసీపీఐ నాయకులు గణేష్ బాబు, నారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వట్టిపల్లి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిని విజయవాడకు చెందిన వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి వట్టిపల్లి రామస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాజగృహలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈ.రత్నప్రదీప్ ప్రకటించారు. అనంతరం సభ్యులు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వట్టిపల్లి రామస్వామిని సత్కరించారు. కార్యక్రమంలో ఎం. వెంకటేశ్వరరావు, మోహన్‌దాస్, నరసయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న సంగీత విభావరి



పటమట(విజయవాడతూర్పు): మంగళగిరి వద్ద సి.కె కన్వెన్షన్‌లో ఈ నెల 31వ తేదీన ప్రముఖ గాయకుడు హరిచరణ్‌తో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని రవి మెలోడీస్ మేనేజింగ్ డైరెక్టర్ రవికుమార్ మంద తెలిపారు. గురువారం లబ్బీపేటలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. బుక్ మై షో లో టికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ వీరా మాట్లాడుతూ రవి మెలోడీస్ టాలెంట్ సింగర్స్‌కి ప్లాట్‌ఫాం ద్వారా వెలుగులోని తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ ఆర్టిస్ట్ మేనేజర్ మహేష్ మంద మాట్లాడుతూ విజయవాడకు మంచి సంగీత విభావరి రావాలని కోరుకున్నామని, అది ఇప్పుడు సాధ్యమవుతుందని అన్నారు. డ్యాన్సర్ అక్సాఖాన్ మాట్లాడుతూ విజయవాడలో 31న ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. బొమ్మినేని ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, హర్షిత డెవలపర్స్ చైర్మన్ పాండురంగారావు పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పెళ్లికి వెళ్లి మరుసటి రోజు ఇంటికి వచ్చే సరికి బంగారం, వెండి, నగదు అపహరణకు గురైన ఘటన ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన నారిన పద్మ కుమారి, సత్యనారాయణ దంపతులు, వీరికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. సత్యనారాయణ కబేళా సెంటర్‌లోని పెయింట్ కంపెనీలో పని చేస్తాడు. అతను వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈనెల 11న పద్మ కుమారి పెళ్లికి వెళ్లింది. 12వ తేదీ తిరిగి వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. కిటికీల్లోంచి చూడగా వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. భర్తకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఇంట్లో 30 తులాల బంగారం, 4 కేజీల వెండి, రూ.6లక్షల నగదు కనిపించలేదు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్తను పిలిచి విచారించాలని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు బ్రహ్మం గారి మఠానికి చెందిన ఎలిపిల్లి పాపారావు, దుర్గా మల్లేశ్వరి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పాపారావు తాపీ పని చేస్తుండగా, మల్లేశ్వరి డెకరేషన్ పనులు చేస్తుంటుంది. బుధవారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి మల్లేశ్వరి బయటకు వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన పాపారావు, కుమారులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పైపులైన్లు వేశారు.. కనెక్షన్లు మరిచారు!

- పాతపైపుల్లో మురుగు నీరు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు



సెంట్రల్ బ్యాంక్‌కు సమీపంలో పూడ్చకుండా వదిలేసిన గొయ్యి



హెచ్‌బీకాలనీ ఎల్‌ఐజీలో కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన పైపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన అమృత్ పథకం పనులు నెమ్మదించాయి. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే ఈ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. పైపులైన్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో పాత పైపులైన్‌ల ద్వారా సరఫరా అవుతున్న మురుగు, కలుషితమైన నీటినే ఆయా కాలనీవాసులు తాగాల్సిన దుస్థితి నెలకొంది.

తుప్పపట్టిన పైపులు..

భవానిపురం కేపీహెచ్‌బీ కాలనీ ఎల్‌ఐజీలో అంతా నిరుపేదలే నివసిస్తున్నారు. దశాబ్దాల కిందట ఈ కాలనీ నిర్మాణం జరిగింది. ఇక్కడ మొత్తం 8 బ్లాకులు ఉన్నాయి. వీటిలో ఒక్కో బ్లాక్‌లో 12 ప్లాట్‌లు ఉన్నాయి. కాలనీ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన పైపులైన్ల ద్వారానే తాగునీటి సరఫరా జరుగుతోంది. కొన్ని ఇళ్లకు ఇచ్చిన కనెక్షన్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పైపులైన్లు తుప్పుబట్టడం, అక్కడక్కడ లీకుల కారణంగా పైపుల్లో మురుగు నీరు వస్తోంది.

లక్ష్యసాధనలో తీవ్రజాప్యం..

గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన బుడమేరు వరదలకు ఈ ప్రాంతమంతా జలమయమైంది. పైపులైన్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేసి ఎత్తు పెంచారు. ఈ క్రమంలో దెబ్బతిన్న పాత పైపులైన్ కనెక్షన్‌లు గుర్తించడం కష్టంగా మారింది. పాత వాటి స్థానంలో అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి కొత్త కనెక్షన్‌లు ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ ఆ లక్ష్యాన్ని సాధించడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఇప్పటికే ప్రధాన పైపులైన్ల నిర్మాణం పూర్తి కాగా, ఇంటింటికి ఇవ్వాల్సిన కనెక్షన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కట్టలు కట్టి..వదిలేశారు

ప్రధాన పైపులైన్ నుంచి ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలి. ఇళ్లకు ఇప్పటికే ఉన్న కొళాయి కనెక్షన్‌కు వీటిని అనుసంధానిస్తారు. అయితే ఆ ఇళ్లకు సమీపంలో పైపులైన్‌కు కనెక్షన్ ఇచ్చే ప్లాస్టిక్ పైపునకు క్యాప్ బిగించి వదిలేశారు. దీంతో ప్రతి బ్లాక్ ఎదురుగా కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. పాత కనెక్షన్ ఎక్కడో చూపిస్తే దానికి అనుసంధానిస్తామని సిబ్బంది చెబుతుండటంతో ఏమిచేయాలో స్థానికులకు పాలుపోవడం లేదు. పైపులైన్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా కనెక్షన్ ఇవ్వడం లేదని చెబుతున్నారు. మే నెలలో సగం రోజులు పూర్తయినప్పటికీ కూడా కనెక్షన్ ఇవ్వకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనెక్షన్ ఇవ్వకుండా జాప్యం చేస్తే పైకి వదిలేసిన పైప్‌లు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. పోలీసు స్టేషన్ రోడ్డులో సెంట్రల్ బ్యాంకు పక్కన కనెక్షన్ కోసం తీసిన గొయ్యిని సైతం నెలలు గడుస్తున్నా పూడ్చలేదు. పైపులైన్ నుంచి ఇళ్లకు కనెక్షన్ ఇవ్వలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పైపులైన్ నుంచి ఇళ్లకు నీటిసరఫరా కోసం కనెక్షన్లు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



పైపులైన్ నుంచి ఇళ్లకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన పైపులు

జకియా ఖానం రాజీనామా దుర్మార్గం



షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శాసనమండలి మాజీ డెప్యూటీ చైర్మన్ జకియా ఖానం తన ఎమ్మెల్సీ, ఇతర పదవులకు రాజీనామా చేయటం అత్యంత దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ విమర్శించారు. దేశంలో ఏ రాజకీయ పక్షాలు ముస్లిం సమాజాన్ని నాశనం చేయాలని చూస్తున్నాయో ఆ పార్టీలో చేరటం దారుణమన్నారు. ఆమె రాజీనామా చేయటం ద్వారా ముస్లింలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశారని తద్వారా యావత్ ముస్లిం సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి జకియా ఖానం భర్త అందించిన సేవలకు గమనంలో ఉంచుకొని, ఆయన మరణిస్తే ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారన్నారు. ఒక ముస్లిం మహిళను ఎమ్మెల్సీ చేయడమే గాక శాసనమండలిలో డెప్యూటీ చైర్మన్ పదవిని సైతం అందించారని గుర్తు చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం మహిళకు ఒక ఉన్నత స్థానాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తే ఈ విధమైన వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రాజకీయ భవిష్యత్ కన్నా విలువలు ప్రధానమన్నారు. ఇటువంటి సంఘటనల ద్వారా దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న తీరు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఆమె బీజేపీలో చేరటం ద్వారా రాజకీయ భవిష్యతే కాక ఇంకా ఏ భవిష్యత్తు లేకుండా చేసుకున్నారని పేర్కొన్నారు. ఆమె పార్టీ మారినంత మాత్రాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం లేదన్నారు.

గార్బేజ్ పాయింట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ అవసరం

అధికారులతో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వ్యర్థాల తరలింపుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ సెక్రటరీలందరూ నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని, పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించాలని, మూడు నెలల కంటే ఎక్కువగా గైర్హాజరైన కార్మికులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు సచివాలయం పరిధిలోని సెక్రటరీ అన్ని వీధుల్లో శుభ్రతను పరిశీలించాలని, ఎక్కడైతే చెత్త, వ్యర్థాలను అధికంగా ఉంటున్నాయో వాటిపై దృష్టి సారించి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రజారోగ్యం సిబ్బంది ప్రజలకు ఆరోగ్యం పట్ల అవసరమైన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, ఫ్రైడే- డ్రైడే ఇలాంటి పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. నగరంలో బల్క్ వేస్ట్ జనరేటర్లయిన ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, రెస్టారెంట్లు వద్ద ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలని అన్నారు. అసిస్టెంట్ మెడికల్ హెల్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ అన్నపూర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. సోమశేఖర్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సత్యబాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మున్సిపల్ కార్యాలయం యూనియన్ సర్కిల్-1 గౌరవాధ్యక్షుడు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తాత్కాలిక కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర సమస్యలపై ఈ నెల 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కాళేశ్వరరావు మార్కెట్ సెటర్‌లోని కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కష్టాన్ని దోచుకోవడమే తప్పా, వారి సంక్షేమాన్ని, అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కార్మికుల చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు అండగా ఉంటున్నారని చెప్పారు. దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ మతోన్మాదం విషం చిమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని విజయవాడ నగరంలో జరుగుతున్న భారీ ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాంబశివరావు, కొండ మహేష్, రాంబాబు, రమణమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

బెరంపార్క్ ప్రైవేటీకరణ తగదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్‌ను ఓ ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టాలన్న ఆలోచనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి, కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పర్యాటక శాఖలోని కొన్ని యూనిట్లను పీపీపీపీ(పి4) విధానం ద్వారా ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించే యత్నంలో వార్తలు వస్తున్న నేపథ్యంలో సీపీఎం నాయకులు గురువారం బెరంపార్క్‌లో పర్యటించారు. ప్రైవేటీకరణతో కలిగే అనార్థాలను పర్యాటకులకు వివరించారు. సీఎంగా చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటీకరణ చేయడమే పనిగా పెట్టుకుంటారని ధ్వజమెత్తారు. ఇకనైనా ఈ విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు కె.సూరిబాబు, ఎస్.సుబ్బారెడ్డి, బి.అచ్చేశ్వరరావు, ఎన్.చిన్నగురప్ప, వి.సాంబులు పాల్గొన్నారు.

ఆ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

సీలింగ్ ల్యాండ్స్ కేసులపై ఆర్డీఓలను ఆదేశించిన కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీలింగ్ ల్యాండ్స్‌కు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారు(ఆర్‌డీవో)లను కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి గురువారం సీలింగ్ ల్యాండ్స్ కేసులపై తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆర్డీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణల చట్టం 1973 ప్రకారం ఆర్డీఓలు డివిజన్ పరిధిలో ట్రిబ్యునల్ అథారిటీ అయినందున సంబంధిత కేసులను తక్షణమే పరిష్కరించాలన్నారు. సీలింగ్ ల్యాండ్స్ కింద ఆ భూములను స్వాధీనం చేసుకొని 22ఏ నిషేధిత జాబితా నందు సంబంధిత వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సీలింగ్ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటికి ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ అవసరాల నిమిత్తం వినియోగించాలని ఆదేశించారు. ఇంకా విచారణలో ఉన్న కేసులను తక్షణమే పరిష్కరించి సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుని, సర్వే నంబర్, విస్తీర్ణాలను నిషేధిత జాబితాలో పొందుపరచాలన్నారు. ఆ భూములకు సంబంధించి ఏ విధమైన రిజిస్ట్రేషన్లు జరగకుండా సంబంధిత సబ్-రిజిస్ట్రార్‌లను ఆదేశించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

లా నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలి

విజయవాడలీగల్: జూనియర్ న్యాయవాదులకు ఆసరాగా నిలిచేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన లా నేస్తం పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్షుడు, కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు లా నేస్తం పథకం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయకపోవడంతో జూనియర్ న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, కోశాధికారి ముద్దాడ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, మహిళా కార్యదర్శి కె.అనురాధ, గవర్నింగ్ బాడీ సభ్యులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట సీఐ కొండలరావు పిలుపునిచ్చారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు అపార్టుమెంట్లలో కొత్త చట్టాలు - అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండలరావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 1930ను ఏఏ సందర్భాల్లో.. ఏవిధంగా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. ప్రజలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది, అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. 79 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి వాహనాలు నడిపిన 79 మందికి 6వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భారీగా జరిమానా విధించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు తెలిపారు. 5వ ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 14వ తేదీ రాత్రి జరిపిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 79 మంది పట్టుబడినట్లు వెల్లడించారు. వీరిని న్యాయమూర్తి లెనిన్‌బాబు వద్ద గురువారం హాజరుపర్చామని తెలిపారు. నిందితుల్లో 14 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, 65 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా రోజూ వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు.

భార్య, పిల్లలను చంపేస్తానని బెదిరించిన భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తనను, పిల్లలను చంపేస్తానంటూ భర్త బెదిరిస్తున్నాడని ఓ మహిళ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు...హెచ్‌బీ కాలనీ ఓల్డ్ ఎంఐజీకి చెందిన తిమ్మినేని జయంతి, శ్రీనివాసరావు దంపతులు. శ్రీనివాసరావు కొన్నాళ్లు వైన్ షాపులోనూ, కొన్నాళ్లు డ్రైవర్‌గా పనిచేశాడు. నిత్యం తాగి వచ్చి భార్య జయంతిని వేధిస్తున్నాడు. ఇద్దరి మధ్య గొడవ కావడంతో రెండు నెలలుగా విడిగా ఉంటున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో భార్య వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. అందుకు ఆమె నిరాకరించి తన వద్ద డబ్బులు లేవని చెప్పింది. తనను కూడా ఇంట్లో ఉండనివ్వాలని లేని పక్షంలో భార్య, పిల్లలను చంపుతానని బెదిరించాడు. దీనిపై బాధితురాలు జయంతి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పర్యాటక శాఖను ప్రక్షాళన చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)ను మరింత అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖను ప్రక్షాళన చేయాల్సి ఉందని సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. హరిత బెరంపార్క్‌లో గురువారం ఆయనను కలిసిన మీడియాతో మాట్లాడారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి పరిచే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధికి సంబంధించి 20 ప్రతిపాదనలను సిద్ధం చేశామని వివరించారు.

భవానీ ఐలాండ్‌ను సరికొత్త అందాలతో తీర్చిదిద్దనున్నామన్నారు. అలాగే ద్వీపానికి వచ్చే పర్యాటకులకు రెండు గంటల పాటు నిర్విరామ వినోదాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. భవానీ ఐలాండ్‌లో వాటర్ స్పోర్ట్స్‌తో పాటు బోధిసిరి డబుల్ డెక్కర్ బోట్‌లో ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు అనువుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అరకు కాఫీకి విశేష ప్రాచుర్యం కలిగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200 అవుట్‌లెట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పర్యాటక కేంద్రాల్లో టాయిలెట్స్ సౌకర్యంతోపాటు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా సౌకర్యాలు, వసతులను కల్పించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

వీధి వ్యాపారులందరినీ సర్వే చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వీధి వ్యాపారస్తుల సర్వే నిర్వహిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఉన్న వీధి వ్యాపారులందరినీ సర్వే చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం నగరంలో జరుగుతున్న వీధి వ్యాపారస్తుల సర్వేలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బందరురోడ్డులోని ఇందిరాగాంధీ స్టేడియం వద్ద వీధి వ్యాపారం చేస్తున్న మహిళతో సర్వేలో ఉన్న 45అంశాలని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు వివరాలు, జీవనాధానం, ఎప్పటి నుంచి వీధి వ్యాపారం చేస్తున్నారు, రోజుకు ఎన్ని గంటల వరకు చేస్తారు వంటి విషయాలను నమోదు చేసి వారికి గుర్తింపు కార్డులను ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సర్వే మొత్తం ముగించి వీధి వ్యాపారుల కచ్చితమైన నివేదికను సమర్పించాలని, వెల్ఫేర్ సెక్రటరీలు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సర్వేలో ఆరుగురు సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో వీటిని పొందుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జోనల్ కమిషనర్లు ఈ సర్వే మొత్తం పర్యవేక్షించి ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై సమీకృత దాణా అందజేత



పాడి రైతుకు దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీ కార్యక్రమం గొల్లపూడిలోని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకుగాను 450 కేజీల దాణాను పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొల్లపూడి పశువుల ఆసుపత్రి వైద్యుడు హరీష్ మాట్లాడుతూ పాడి రైతులు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండటంతో పాటు భారత్ పశుధన్ యాప్‌లో నమోదై ఉండాలని పేర్కొన్నారు. 50 కేజీల దాణా బ్యాగ్ విలువ రూ.1110 కాగా సబ్సిడీపై రూ.555లకు లభిస్తుందని తెలిపారు. పశు పోషకులు దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని డబ్బు చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నవగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మండపంలో నవగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల వివరాలను ఆలయ వైదిక కమిటీ ఈవో శీనానాయక్‌కు అందజేసింది. 17వ తేదీ నుంచి ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభమై 19వ తేదీతో ముగుస్తాయి. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో అవసరమైన పనులను దేవస్థాన ఇంజినీరింగ్ విభాగం యుద్ధప్రాతిపదికన చేపట్టింది. అదే విధంగా ఆలయ ప్రాంగణంలోని రాధాకృష్ణుల విగ్రహం వద్ద దాతల సహకారంతో నిర్మించిన నూతన యాగశాలలో కూడా నిత్యం యాగాలను నిర్వహించేలా చూడాలని ఆలయ ఈవో శీనానాయక్ వైదిక కమిటీకి సూచించారు. నవగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల నేపథ్యంలో యాగాలను నూతన యాగశాలలో నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపం నుంచి డ్రెయినేజీ పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అపస్మారక స్థితిలో చిట్టినగర్‌లో గుర్తించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొత్తపేట పోలీసులు గురువారం పేర్కొన్నారు. ఆ వ్యక్తి పటమటలోని తోట వారి వీధికి చెందిన చెల్లూరి బాజీ(45)గా గుర్తించామని పేర్కొన్నారు. ఘటనపై బాజీ భార్య హుస్సేన్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాజీ కబేళా సెంటర్‌లోని ఓ పరుపుల కంపెనీలో పని చేస్తుంటాడని, అతనికి మద్యం సేవించే అలవాటు ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం తన ఇంట్లో ఉన్న కొద్దిపాటి మద్యం సేవించి బయటకు వెళ్లినట్లు పేర్కొన్నారు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో బాజీ పని చేస్తున్న ఓనర్‌కు ఫోన్ చేయగా, ఉదయమే తన వద్దకు వచ్చి డబ్బులు తీసుకుని వెళ్లారన్నారు. అయితే ఫోన్ చేసినా ఫలితం లేకపోవడం బుధవారం వార్త పత్రికల్లో బాజీ ఫొటో చూసి స్టేషన్‌కు వచ్చి ఆరా తీయగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారన్నారు.